క్లుప్తంగా

ఎల్లారమ్మకు నేడు పూజలు



తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన గొల్లలపాలెం గ్రామస్తులు మంగళవారం తగరపువలస వద్ద ఎల్లారమ్మ మెట్టపై అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించి పూజలు చేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి భారీ ఊరేగింపుతో గ్రామస్తులంతా అమ్మవారి ఆలయానికి రావాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు.

సుఖీభవ కాలనీలో అంధకారం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డుల పరిధిలో ఉన్న చిట్టివలస సుఖీభవ కాలనీలో రెండు వారాలుగా వీధిదీపాలు మొత్తం వెలగడం లేదు. అలాగే కాలనీ ముందు ఉన్న బొగ్గురోడ్డులో జీరుపేట నుంచి చిట్టివలస వరకు వీధిదీపాలు కాలిపోయాయి. అసలే చెరువు ప్రాంతం కావడంతోపాటు శివారు గ్రామం అయినందున చీకటిలో విష పురుగులు, కుక్కల దాడులతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. తరచూ వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఫిర్యాదు చేస్తుంటే కంటి తుడుపు చర్యలుగా అక్కడక్కడ వీధిదీపాలు వెలగించి మళ్లీ వాటిని తొలగిస్తున్నారు. ఇటీవల కాలనీలో దొంగతనాలు కూడా పెరుగుతున్నందున శాశ్వత ప్రాతిపదికన వీధి దీపాలు పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా పైడితల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



సిరిమాను పెట్టేందుకు సిద్ధం చేసిన బండి

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సోమవారం నుంచి తొలేళ్లతో పైడితల్లమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరిగించారు. ఊరంతా సందడి వాతావరణం నెలకొంది. ప్రతీ ఇల్లు బంధువులతో కిటకిటలాడుతోంది. ఈ సందర్భంగా రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది.

నేటి సిరిమాను సంబరానికి సర్వం సిద్ధం

మంగళవారం జరగనున్న సిరిమాను సంబరానికి ఉత్సవ కమిటీ సర్వం సిద్ధం చేసింది. సిరిమాను ఊరేగించడానికి బండిని సిద్ధం చేశారు. ఆ బండికి రంగులు వేశారు. సిరిమానుకు అవసరమయ్యే కర్రను కూడా సిద్ధం చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమవుతుంది. 25 అడుగల పొడవున్న సిరిమాను బండిపై మలమాను మధ్యలో పెట్టి మూడు సార్లు గ్రామంలో తిప్పుతారు.

'నాడు - నేడు' పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం



పెదనాగమయ్యపాలెంలో ఉపాధ్యాయులు, స్థానికులతో మాట్లాడుతున్న నరసింహారావు

తగరపువలస: 'నాడు - నేడు' పథకం కింద చేపడుతున్న పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని ఎస్ఎస్ఏ డీఈ నరసింహారావు ఆదేశించారు. భీమిలి మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న తాళ్లవలస యాతపేట, గొల్లలపాలెం, అమనాం, గొల్లల తిమ్మాపురం, మంగమారిపేట జెడ్పీ హైస్కూల్, చిట్టివలస బాలికల హైస్కూల్, చిప్పాడ హైస్కూల్, పెదనాగమయ్యపాలెం, ఆశిపాలెం అంగన్‌వాడీ కేంద్రం, తదితర నిర్మాణంలో ఉన్న 15 పాఠశాలలను ఆయన సందర్శించారు. సిమెంట్, ఇసుక అందుబాటులో ఉన్న పాఠశాలల యాజమాన్యాలు పనుల్లో జాప్యం చేయకుండా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయనవెంట ఏఈ మహాలక్ష్మి, భీమిలి ఎంఈవో కేఏ బాలామణి తదితరులు ఉన్నారు.

చిట్టివలస బాలికల హైస్కూల్‌కు కొత్తరూపు



విద్యార్థుల కోసం నిర్మిస్తున్న టాయిలెట్లు

- 'నాడు - నేడు' పథకంలో పనులకు రూ.1.16 కోట్లు మంజూరు
- చురుగ్గా అదనపు తరగతి గదులు, టాయిలెట్ల నిర్మాణం



చిట్టివలస బాలికల హైస్కూల్‌లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు

తగరపువలస: 'నాడు - నేడు' పథకంతో చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ కొత్తరూపు సంతరించుకోనుంది. ఈ పథకం ద్వారా హైస్కూల్‌కు రూ.1.16 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థినులు 39 మంది ఇటీవల పరీక్షలు రాసి వెళ్లిపోగా తెలుగు, ఇంగ్లిష్ మీడియం కలిపి ప్రస్తుతం 171 మంది ఉన్నారు. వీరికి అయిదు తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. మరో అయిదు తరగతి గదులు మంజూరు కాగా 'నాడు - నేడు' పథకం కింద రూ.65 లక్షలతో నాలుగు గదులు నిర్మిస్తున్నారు. వీటిని 2023 - 2024 విద్యా సంవత్సరానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. మిగిలిన రూ.51 లక్షలతో 12 యూనిట్ల టాయిలెట్లు, ఆర్వో వాటర్ ప్లాంట్, ప్రహరీ, తరగతి గదుల మరమ్మతులు, రన్నింగ్ వాటర్ సదుపాయం, ఎలక్ట్రికల్ రిపేర్లు, గ్రీన్‌బోర్డులు తదితర పది కాంపోనెంట్‌లు సమకూర్చనున్నారు.

ఏడాదిలో పూర్తి ఇంగ్లిష్ మీడియం..



ప్రస్తుతం మా హైస్కూల్‌లో 2023 - 2024 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతులకు సంబంధించి ఇంగ్లిష్ మీడియం, 10వ తరగతి తెలుగు మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. 2024 - 2025 విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌గా మారిపోతుంది. తమ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం లేదని జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మవద్దు.

– సీహెచ్.రోజామణి, ప్రధానోపాధ్యాయురాలు, చిట్టివలస బాలికల హైస్కూల్

మధురవాడ జోన్ - 2లో సీవోలు వీరే

మధురవాడ: జీవీఎంసీ జోన్ - 2లో 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్లలో కొందరు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇటీవల కొందరు బాధ్యతలు చేపట్టారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి.

సీవో పేరు	వార్డులు	ఫోన్ నెంబరు
ఎస్.గంగాధర్	ఏపీడీ	77299 95947
సీహెచ్.యువ రాణి జూ..	అసిస్టెంట్	99630 43257
ఎ.ఆదినారాయణరెడ్డి	5	77299 95933
జి.అప్పారావు	6	91333 96547
కేఎస్‌వీఎస్ ప్రవీణ కుమార్	7	79016 10413
కేఎస్ దీప	8	91777 45041
ఎమ్‌వీ రమణమ్మ	9, 10	79016 10411
ఎమ్.అరుణ్ కుమార్	11	79016 10453
జి.నూకరత్నం	12	83670 68833

ఆర్వో ప్లాంట్ నిర్వహణ గాలికి...

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస కాలనీలోని ఆర్వో ప్లాంట్ వద్ద నిర్వాహకులు లేక మూతపడింది. దివీస్ లేబొరేటరీ ఏర్పాటు చేసిన ఇక్కడి ప్లాంట్ నుంచి రూ.100 కార్డు కొనుగోలు చేసిన కాలనీ వాసులు 20 లీటర్ల కేన్‌తో నీటిని తీసుకెళ్లినప్పుడల్లా రూ.5 ఛార్జీ పడుతుంది. ఇటీవల ప్లాంట్ నిర్వహణ చూసేవారు లేక శుద్ధిచేసిన తాగునీరు తీసుకెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసినా ఇందులో నీరులేక, శుభ్రత లేక ఖాళీ కేన్లతో వెనుదిరుగుతున్నారు. ప్లాంట్ నిర్మించిన దివీస్ లేబొరేటరీ లేదా నిర్వహణ బాధ్యతలు తీసుకున్న జీవీఎంసీ జోక్యం చేసుకుని తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నిర్వహణ లేక సంగివలస కాలనీలో మూతపడిన ఆర్వో ప్లాంట్

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

కొమ్మాది: సాంకేతిక విద్యను అభ్యసించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏపీఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష సోమవారం రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. పరీక్ష రాసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కేంద్రానికి ఉదయం 8గంటలకు చేరుకున్నారు. తొలి విడత పరీక్ష ఉదయం 9కి ప్రారంభమై 12 గంటలకు ముగిసింది. 200 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 192 మంది హాజరయ్యారు. అదేవిధంగా రెండో విడత పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగింది. 200 మందికి 181 మంది హాజరయ్యారు. ఈ ప్రవేశ పరీక్షకు సూపరింటెండెంట్‌గా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి రజిని వ్యవహరించారు.



పరీక్ష కోసం కళాశాలకు వచ్చిన విద్యార్థులు

డెంగ్యూతో అప్రమత్తం

- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వ్యాధి పీడితులు
- అపారిశుధ్యంతో దోమల స్వైరవిహారం
- నేడు జాతీయ డెంగ్యూ దినోత్సవం

మహారాణిపేట: దోమల వల్ల సోకే వ్యాధుల్లో గెంగ్యూ ఒకటి. దోమకాటు ద్వారా 5 నుంచి 8 దినాల్లో డెంగ్యూ వాధి లక్షణాలు బయట పడతాయి. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరంతో పాటు తలనొప్పి, కంటి రెప్పల కదలికలు తగ్గడం, కదిలించినప్పుడు భరించలేని నొప్పి కలగడం, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, చర్మంపై ఎర్రని దద్దుర్లు, నాడి నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు పడిపోవడం, శరీరంలోని వివిధ రంధ్రాల ద్వారా రక్తస్రావం జరుగుతుంది. ఈ రోగ లక్షణాలు అన్నీ ఉండకపోవచ్చు. ఇందులో కొన్ని లక్షణాలు మాత్రం వుంటాయి. డెంగ్యూ జ్వరం ఫ్లూ వంటి లక్షణాలను కలిగి ఉంటుంది. ప్రతి ఏడాది మే 16న డెంగ్యూ జాతీయ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి

డెంగ్యూ జ్వరంలో రోగికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయి. వాతావరణంలో మార్పు వల్ల, ఎక్కడ పడితే అక్కడ అపారిశుధ్యం పేరుకుపోవడం వల్ల దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీని వల్ల ఒళ్ల నొప్పులతో కూడిన జ్వరం, చలి జ్వరం కలుగుతుంది. గత కొద్ది రోజులుగా కేజీహెచ్‌తో పాటు నగరంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగ్యూ జ్వర పీడితులు చేరుతున్నారు. ప్రస్తుతం 322 మంది డెంగ్యూ రోగులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మొత్తం 1964 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 322 మందికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. ప్రస్తుతం కేజీహెచ్ భావనగర్ వార్డులో వీరి కోసం ప్రత్యేకంగా కొన్ని మంచాలు సిద్ధం చేశారు. రోజు ఓపీకి 10 నుంచి 20 మంది జ్వరబాధితులు వస్తున్నారు. ఇందులో 5 నుంచి 10 వరకు డెంగ్యూ కేసులు ఉంటున్నాయి.

డెంగ్యూకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు

అనేక ఆస్పత్రుల్లో డెంగ్యూ కేసులకు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. 15 ఆస్పత్రుల్లో డెంగ్యూ కేసుల చికిత్స ఉచితంగా ఇస్తున్నట్టు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ రాజేష్ తెలిపారు. డెంగ్యూతో బాధపడుతున్న వారు ఏవరైనా ఉంటే తమను సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

డెంగ్యూ కేసులకు చికిత్స ఇస్తున్నాం



డెంగ్యూ కేసులుంటే భయపడవలసిన అవసరం లేదు. చికిత్స కోసం కేజీహెచ్‌కు రావచ్చు. ప్రస్తుతం కేజీహెచ్‌లో డెంగ్యూ బాధితులకు చికిత్స అందుతోంది.

– డాక్టర్ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్.

డెంగ్యూ వ్యాధి అదుపునకు పలు చర్యలు



ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. హెల్త్ సిబ్బంది ఇంటి పరిసరాల్లో దోమలు పెరగకుండా అవగాహన కల్పిస్తున్నారు. డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో దోమలను నాశనం చేయడానికి మందును పిచికారీ చేయడం, ఫాగింగ్ నిర్వహిస్తున్నాం. డెంగ్యూను ప్రాథమికంగా గుర్తించే కిట్లు అందుబాటులో వుంచుతున్నాం.

డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి.

భగవద్గీత సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

దాబాగార్డెన్స్: భగవద్గీత సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు తెలిపారు. వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం బహుళ ఏకాదశి సందర్భంగా భగవద్గీత శ్లోకాల సామూహిక పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి ఉపదేశించడం ద్వారా లభించిన భగవద్గీత విశిష్టతను తెలియజేసి సర్వ జనావళి గీతా సారాంశాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీమద్భగవద్గీత విశ్వ గ్రంథంగా విరాజిల్లుతోందన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి. లక్ష్మీనరసింహ, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో కొత్తమ్మతల్లి



తగరపువలస: సంతపేట కొత్తమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని సోమవారం సాయంత్రం రాయల్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో గాజులతో అలంకరించారు. మంగళవారం ఈ అలంకరణతో అమ్మవారి దర్శనం భక్తులకు కల్పించనున్నారు. అలంకరణకు కె.సోమేశ్వరరావు సహకరించగా భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి తదితరులు అలంకరణ సేవలో పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇళ్లు ఇవ్వాలని వినతి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీలో అర్హులైన వారికి జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ పంచాయతీ వార్డు మెంబర్ మహంతి అప్పల రమణ విశాఖపట్నం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలోఅధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఇళ్లు ఉన్న వారికే కురపల్లి, ఏనుగులపాలెం లే అవుట్లలో ప్లాట్లు ఇచ్చారని, ఒకే కుటుంబంలో ముగ్గురికి కాలనీ ఇళ్లు, భార్యభర్తలిద్దరికీ కాలనీ ఇళ్లు మంజూరు చేశారని, భర్తకు ఒక లే అవుట్‌లో, భార్యకు ఇంకొక లే అవుట్‌లో స్థలం మంజూరు చేశారని ఆరోపించారు.

బాలుర గృహానికి 'ఆసరా' వితరణ



బాలుర గృహం అధికారులకు జ్యూట్ బ్యాగులు కుట్టే యంత్రాలు అందిస్తున్న ఆసరా సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ: చినగదిలి దరి దీన్‌దయాల్‌పురంలో ఉన్న ప్రభుత్వ బాలుర గృహానికి ఆసరా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జ్యూట్ బ్యాగులు తయారు చేసే యంత్రాలు అందజేశారు. ఇక్కడ 14 ఏళ్లు నిండిన 20 మంది బాలురకు ఇటీవల జన శిక్షణ సంస్థ జ్యూట్ బ్యాగులు తయారీలో శిక్షణ ఇచ్చింది. ఈ విషయం తెలుసుకొన్న పీఎం పాలెంలో నిర్వహిస్తున్న ఆసరా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇక్కడ బాలురకు మరింత నైపుణ్యంతో బ్యాగులు తయారు చేయడానికి యంత్రాలు ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ అధ్యక్షుడు రామారావు, సభ్యులు సూర్యనారాయణ, రాఘవ రెండు యంత్రాలను గృహం సూపరింటెండెంట్ వీరయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మాట్లాడుతూ వృద్ధాశ్రమం కూడా నిర్వహిస్తున్నామని, ఉచితంగా సేవలు అందిస్తున్నామన్నారు. నిరాశ్రయులైన వృద్ధులు పీఎంపాలెంలో ఆసరా సంస్థ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో చేరవచ్చన్నారు.

ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలకు పూర్వ విద్యార్థుల సహకారం



హెల్త్ యూనివర్శిటీ మాజీ వీసీ రవిరాజ్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యులు

మహారాణిపేట : శతాబ్ది ఉత్సవాలకు పూర్వ విద్యార్థులు ఎంతో సహకరిస్తున్నారని వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.రవిరాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్లో పూర్వ వైద్యుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వంద సంవత్సరాల చరిత్ర గల ఆంధ్రా మెడికల్ కాలేజీ ఈ ఏడాది శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తోందని అన్నారు. పూర్వ విద్యార్థుల పేరుతో భవన నిర్మాణం జరుగుతోందన్నారు.

నివాసాల మధ్య ఆర్వో ప్లాంట్‌తో ఇబ్బందులు

జోన్ - 2 స్పందనలో పలువురు ఫిర్యాదు



రైతుబజార్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు చేస్తున్న రైతులు, ఈవో

మధురవాడ: జీవీఎంసీ 7 వార్డు స్వతంత్రనగర్ టైలర్స్ కాలనీలో నివాసాల మధ్య కొందరు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని, తక్షణమే పనులు నిలుపుదల చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగారు ప్రకాశ్, కాలనీ మహిళలు జెడ్పీ కనక మహాలక్ష్మి ఫిర్యాదు చేశారు. మధురవాడ జోన్ - 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి జెడ్సీ వినతులు స్వీకరించారు. జోన్‌లోని 9 వార్డుల నుంచి 11 అర్జీలు వచ్చాయి. మధురవాడ రైతు బజార్ - హైవే మధ్యలో చిన్నపాటి సీసీ రోడ్డుకు ఇరువైపులా అనధికార దుకాణాల ఏర్పాటుతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్టేట్ ఆఫీసర్ జగదీశ్వరరావు, పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నిర్మించిన రోడ్డుపై కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, చర్యలు చేపట్టాలని ఓల్డ్ డైరీ ఫారమ్ సుందర్‌నగర్ వాసులు కోరారు. ఎండాడ నుంచి గీతం కాలేజీకి వెళ్లే 100 అడుగుల రోడ్డులోని రోడ్డు స్థలంలో నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంక్ పనులు ఆపాలని స్థానికులు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు నాలుగు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి రెండు వినతులు వచ్చాయి. ఈ సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని జెడ్సీ రాము తెలిపారు.

భీమిలి విద్యార్థులకు కిక్ బాక్సింగ్‌లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ చిట్టిబాబు, సర్పంచ్ శ్రీను

తగరపువలస: ఈ నెల 13, 14న నగరంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ - 2023లో భీమిలి విద్యార్థులకు బంగారు, రజత పతకాలు లభించాయి. కోచ్ కర్రి చిట్టిబాబు ఆధ్వర్యంలో పోటీలకు వెళ్లిన రేఖవానిపాలెం పంచాయతీ చిన్నారుల్లో ఫైటింగ్, కాటా విభాగాల్లో బి.సాయిచరణ్‌కు రెండు బంగారు పతకాలు, కె.శ్యామ్, సత్య వశిష్టకు చెరో బంగారు, సిల్వర్ పతకాలు లభించాయి. అలాగే ఇటీవల బెల్ట్ గ్రేడింగ్‌లో కె.అభిషేక్, పి.హర్షవర్ధన్, టి.గుణశేఖర్, టి.వెంకట సాయి వర్ధన్, బి.చంటి, బి.షర్మిలకు సర్పంచ్ సమ్మిడి శ్రీను చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు కోచ్‌ను అభినందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు అక్కరమాని అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలతో జనం బెంబేలు



మారికవలస హైవేలో చెరుకు రసం తాగుతున్న యువకులు





మధురవాడలో గొడుగు నీడలో వస్తున్న కుటుంబ సభ్యులు

మధురవాడ: భానుడు ప్రతాపం చూపడంతో జనం బెంబేలెత్తిపోయారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచే విపరీతమైన ఎండ వేడిమితోపాటు ఉక్కపోత, వడగాల్పులతో వృద్ధులు, పిల్లలు అల్లాడిపోయారు. భానుని ప్రతాపం సాయంత్రం 5 గంటల వరకు ఒకేలా ఉంది. అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇంటి నుంచి వెలుపలకు రాలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో గొడుగులు తీసుకుని పనులకు వెళ్లారు. ఎండ నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాల దుకాణాలు, చెరుకు రసం బళ్ల వద్ద రద్దీ కనిపించింది. మధురవాడ, కొమ్మాది, మారికవలస, పీఎం పాలెం, మిథిలాపురి వుడా కాలనీ రోడ్లు మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా కనిపించాయి. మరో రెండు రోజుల ఇదే వాతావరణం కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



మధురవాడ జోనల్ కార్యాలయానికి ఎండలో వస్తున్న వృద్ధురాలు

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట : ఢిల్లీలో మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యూ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నిరసనకారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, నేటి వరకు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీదశ మహా విద్యా వైభవం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామనరసింహం, తదితరులు

ఎంవీపీ కాలనీ: రచయిత్రి మంథా సత్యప్రభ గోపాల కృష్ణ రచించిన 'శ్రీదశమహా విద్యా వైభవం'ఈ-గ్రంథాన్ని ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం డాక్టర్ వెంపటి రామనరసింహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీదశమహా విద్యా వైభవం ఆదిపరాశక్తి తాంత్రిక రూపాలను వివరిస్తుందన్నారు. రచయిత్రి సత్యప్రభ మాట్లాడుతూ పాఠకులను ఆకట్టుకునేలా ఈ-గ్రంథాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథా గోపాలకృష్ణ, వరభభట్ల శ్రీరామమూర్తి, వరహాభట్ల భగవతి, తదితరులు పాల్గొన్నారు.